
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 1 । జూలై । 2025



సోమశిలలో 32.128 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారానికి 32.128 టీఎంసీలు ఉన్నాయి. డెల్టాకు 3,330, ఉత్తర, దక్షిణ కాలువలకు 1275 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.99,080
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,961
3 శాతం జీఎస్టీతో	రూ.9,230
నవర (8 గ్రా)	రూ.73,840

గరిష్టం/కనిష్టం
36.7 /29.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 46 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కారుణ్య నియామకాలు



ఉద్యోగ ఉత్తర్వులు అందజేస్తున్న చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించి కొండలరావు, చైతన్య ప్రకాష్‌లకు సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు నియామక ఉత్తర్వులు అందజేశారు.

డీఆర్వో బదిలీ



ఉదయ భాస్కర్‌రావు

నెల్లూరు (అర్బన్): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా పనిచేస్తున్న ఉదయభాస్కర్ రావును బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను అమరావతి రాష్ట్ర సెక్రటేరియట్‌లోని రెవెన్యూ శాఖలో ప్రభుత్వ అసిస్టెంట్ సెక్రటరీగా నియమించింది. రెగ్యులర్ డీఆర్వోను నియమించేంత వరకు ఎఫ్ఏసీ డీఆర్వోగా అర్హత గల వారిని కలెక్టర్ నియమించుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డీపీటీఓగా ఎస్‌కే షమీమ్



బాధ్యతలు స్వీకరిస్తున్న షమీమ్

నెల్లూరు సిటీ: నెల్లూరు జిల్లా ప్రజా రవాణా శాఖ (డీపీటీఓ) అధికారిగా ఎస్‌కే షమీమ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డీపీటీఓగా విధులు నిర్వహిస్తున్న మురళీబాబు ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరులోని డిప్యూటీ సీటీఎంగా విధులు నిర్వహిస్తున్న షమీమ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆమె స్థానంలో శృంగవరపుకోట డిపో మేనేజర్ రమేష్‌ను ఉద్యోగోన్నతిపై నెల్లూరు డిప్యూటీ సీటీఎంగా బదిలీ చేశారు.

వాకాటి సోదరులకు నోటీసులు

పొదలకూరు: పట్టణానికి చెందిన వాకాటి సోదరులు, వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనివాసులు రెడ్డి, శివప్రసాద్‌రెడ్డిలకు నెల్లూరు రూరల్ డీఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం నోటీసులను జారీ చేసినట్లు ఎస్సై హనీఫ్ తెలిపారు. రుస్తుం మైన్ కేసులో నిందితులుగా చేర్చిన క్రమంలో అక్రమ కేసుల ఒత్తిడితో కొంతకాలంగా అజ్ఞానంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో వీరు ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడంతో ఇంటి గోడలకు నోటీసులను అంటించారు. సోమవారం సాయంత్రం లోగా విచారణ హాజరు కావాలని ఆ నోటిసుల్లో పేర్కొన్నారు.

సర్వేయర్లకు కౌన్సెలింగ్ ద్వారా బదిలీ

నెల్లూరు (అర్బన్): సచివాలయాల పరిధిలోని 291 మంది సర్వేయర్లకు సోమవారం నగరంలోని ఆ శాఖా కార్యాలయంలో ఏడీ నాగశేఖర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ చేపట్టారు. బదిలీలపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ర్యాంక్ ప్రకారం కాకుండా సిఫార్సు లేఖలపై బదిలీ చేయడంతో తమకు అన్యాయం జరిగిందని పలువురు సర్వేయర్లు విచారం వ్యక్తం చేశారు.

భూములతో రైతులది విడదీయలేని తరతరాల అనుబంధం. పొలంలో పచ్చని పైర్లు చూసి మురిసిపోతారే తప్ప.. ప్రకృతి ప్రకోపించి పంట నష్టపోయినా.. ప్రభుత్వం ఆదుకోకపోయినా.. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోయినా ఏనాడు సాగును విరమించలేరు. అది పుడిమి తల్లితో రైతు బిడ్డల బంధం. అటువంటి భూములను నాశనం చేసి ఆయిల్, ఇండోసోల్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గానికి పార్టీలకు అతీతంగా రైతులు ఏకమయ్యారు. అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తామంటూ పోలీసులతో ముందస్తు హెచ్చరికలు చేయించినా.. వందలాది మంది పోలీసు బలగాలను దింపి బ్యారికేడ్లు పెట్టి అడ్డుపెట్టినా కర్షకుల కన్నెర్రకు ఖాకీలే చేతులు ముడుచుకోవాల్సి వచ్చింది.



పోరుకు పోటెత్తిన కరేడు రైతులు (ఫైల్)

రాష్ట్రంలో చర్చనీయాంశమైన కరేడు రైతుల
ఉద్యమ స్ఫూర్తి

- రాస్తారోకోతో తొలి పోరాటం విజయవంతం
- రైతులకు పెరుగుతున్న ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల మద్దతు

కెరటమై ఎగిసిన కర్షకాగ్రహం

ఉలవపాడు: 'మండలంలోని తీర ప్రాంతం కరేడు కర్షకుల ఆగ్రహం కదలి కెరటమై ఎగిసి పడింది. పోలీసుల ఆంక్షలు, ముందస్తు అరెస్టులు, రహదారుల నిర్బంధాలు రైతులను ఆపలేకపోయాయి. పోలీసులు ఎక్కు పెట్టిన తుపాకులకు, ఝుళిపించిన లాఠీలకు ఒక్కొక్కరు.. ప్రకాశం పంతులు, అల్లూరి సీతారామరాజులై గర్జించారు. వేలాది మంది రైతు కుటుంబాలతో తరతరాలుగా వ్యవసాయ భూములతో ముడిపడిన బంధాలను, భావోద్వేగాలను కాదని కంపెనీలకు కట్టబెట్టే ప్రభుత్వ నిరంకుశత్వాన్ని దునుమాడుతూ మండలంలోని కరేడు రైతులు సాగించిన తొలి ఉద్యమాన్ని విజయవంతం చేసి పాలకులకు వణుకు పుట్టించారు. ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే పంట భూములే తమ జీవనాధారమని, అటువంటి భూములను తమ నుంచి తీసుకోవాలంటే, ముందుగా ప్రాణాలు తీసి శవాలపై వచ్చి తీసుకెళ్లాంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇండోసోల్ కంపెనీ కోసం భూసేకరణకు వ్యతిరేకంగా ఆదివారం మండలంలోని కరేడు కర్షకుల పోరు రాష్ట్ర వ్యాప్తంగా రైతుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపింది. వందల మంది పోలీసులు భారీగా మోహరించి అడ్డంకులు పెట్టినా చేధించుకుని సాగించిన రైతులు తమ భూముల కోసం ఎందాకైనా పోరాడతారని చాటారు.

పోలీసుల అణచివేత కుట్ర

రైతుల పోరును అణచివేయడానికి పోలీసులు శతధా ప్రయత్నిస్తున్నారు. పోలీసులతో తోపులాట జరిగిన తరువాత కూడా రైతులు పోలీసు బంధనాలు అధిగమించి రాస్తారోకో చేయడంతో రైతులపై పోలీసులు భారీ చర్యలకు సన్నద్ధమయ్యారు. రాస్తారోకోలో పాల్గొన్న రైతులు 26 మందితోపాటు సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల సమీకరణకు సహకరించేలా చేశారని మరో 13 మందిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. కేసుల ద్వారా ఉద్యమాన్ని అణిచివేయాలనే ఉద్దేశంతో పోలీసులు ప్రవర్తిస్తున్నారు. రాస్తారోకో సమయంలో పోలీసులు ప్రవర్తించిన తీరును ప్రజాసంఘాలు, వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.



జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో (ఫైల్)

ఊహించని రీతిలో..

జాతీయ రహదారిపై కరేడు రైతులు పార్టీలకు అతీతంగా ఏకమై చేపట్టిన రాస్తారోకో విజయవంతం కావడం తెలిసిందే. కూటమి ప్రభుత్వం ఇండోసోల్ కంపెనీకి ఏకంగా 8,348 ఎకరాలు కేటాయించడం రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. భూమి లేకపోతే తమకు జీవనాధారం లేదనే పరిస్థితికి రైతులు రావడంతోనే రాస్తారోకో భారీగా జరిగింది. సుమారు 2 వేల మంది రైతులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. 800 మందికి పైగా మహిళలు ఈ ఉద్యమంలో పాల్గొనడంతో అందరూ నిశ్చేష్టులయ్యారు. తమ శవాల మీద వెళ్లి భూములు తీసుకోవాలని మహిళా రైతులు నినాదాలు చేయడం విశేషం. దాదాపు 20 నిమిషాల పాటు రైతులు జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తాత్కాలికంగా భూసేకరణ వాయిదా వేసి రైతులు సమస్యలు పరిష్కరిస్తామని హామీతో విరమించారు. భూసేకరణపై ఇంత మంది రైతులు వ్యతిరేకంగా ఉన్నారని ఎవరూ ఊహించలేకపోయారు.

రైతులకు పెరుగుతున్న మద్దతు

భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు బయట నుంచి మద్దతు పెరుగుతోంది. పోలీసులు తమ గోడును చెప్పకుండా అడ్డుకోవడంతో వారు చేసిన పోరాటం పలువురిని కదిలించింది. వామపక్షాలు, రైతుకూలీ సంఘాలు మరింతగా ఈ పోరాటానికి సహకరించేలా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. త్వరలో రాష్ట్ర రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కరేడులో పర్యటించనున్నారు. ఆమ్‌ఆద్మీపార్టీ, కాంగ్రెస్ పార్టీ, బీసీవై పార్టీలు ఇప్పటికే తమ మద్దతు ప్రకటించాయి. కరేడులో మాత్రం పార్టీకతీతంగా రైతులే నాయకత్వం వహిస్తూ అన్ని పార్టీలు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్లేషకులు సైతం కరేడు రైతుల ఉద్యమం గురించి మాట్లాడడం విశేషం. ఈ కంపెనీకి 8,348 ఎకరాలు కేటాయించడం పై అందరూ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

కూటమి నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత...

కరేడు భూముల వ్యవహారంపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. తొలుత బీపీసీఎల్‌కు ఇస్తారని ప్రచారం జరిగింది. తర్వాత మార్చి 25 న ఇండోసోల్‌కు కేటాయిస్తున్నట్లు జీఓ ప్రకటించారు. జూన్ 19న భూసేకరణ చేస్తున్నామని నోటిఫికేషన్ ఇచ్చి తీసుకునే భూముల రైతుల వివరాలు ప్రచురించారు. అందులో 4 వేల ఎకరాలకు వివరాలు ప్రకటించారు. నోటిఫికేషన్ వెలువడడంతో ఒక్కసారిగా రైతుల్లో ఆందోళన మొదలైంది. ఉద్యమ బాట పట్టారు. తమ భూములు కోల్పోకుండా ఉండడం కోసం 'సేవ్ కరేడు' పేరుతో భారీ రాస్తారోకో చేపట్టారు. ఈ రైతు ఉద్యమంతో ప్రభుత్వంపై కరేడు రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు అర్థమవుతుంది.

భూ సేకరణ ఆగేనా

కరేడు రైతులు భూ సేకరణకు వ్యతిరేకంగా చేసిన ఉద్యమం ఎగసిపడి విజయవంతమైంది. భూ సేకరణను నిలుపుదల చేయగలమనే విశ్వాసం ఏర్పడింది. పచ్చని పంట పొలాలు సుమారు 3 వేల ఎకరాలు, మామిడి తోటలు 1000 ఎకరాలు, సపోట తోటలు, 2 వేల ఎకరాలు, వేరుశనగ 2 వేల ఎకరాలు మిగిలిన భూములు జామాయిల్, కూరగాయల సాగు కలిసి ఉన్నాయి. ఇంత సారవంతమైన భూములను, అన్నం పెట్టే భూములను తీసుకోవడం దారుణమని రైతులు అంటున్నారు. పోలీసు, ఇంటెలిజెన్స్ అంచనాలకు మించి రైతులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి భూసేకరణ ఆపుతుందా.. మొండిగా ముందుకు సాగుతుందా తదుపరి పరిణామాలు ఏ స్థాయిలో ఉంటాయో వేచి చూడాల్సి వస్తుంది.

అనుమానమే పెనుభూతమై..

- భార్యపై అనుమానంతో హత్యాయత్నం
- మద్యం మత్తులో విచక్షణారహితంగా కత్తితో దాడి
- అడ్డుకోబోయిన అత్త, మామలు హతం
- భార్య పరిస్థితి విషమం
- హత్యలతో ఉలికి పడిన దుత్తలూరు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భార్యపై అనుమానమే పెనుభూతమైంది. రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబంలో మద్యం చిచ్చు రేపింది. మత్తులో విచక్షణ కోల్పోయేలా చేసింది. అడ్డుకోబోయిన అత్త, మామల ప్రాణాలు తీసింది. భార్య కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటనతో దుత్తలూరు ఒక్కసారిగా ఉలికి పడింది. పల్లెల్లో విచ్చలవిడిగా జరుగుతున్న మద్యం విక్రయాలే ఈ ఘటనకు కారణమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దుత్తలూరు: దుత్తలూరు ఏసీ కాలనీ ఆదివారం అర్ధరాత్రి హత్యల కలకలంతో ఉలికి పడింది. మద్యం మత్తులో భార్యపై అనుమానంతో విచక్షణ కోల్పోయిన ఓ వ్యక్తి సాగించిన మారణకాండ ఇది. కాలనీలో నివాసముంటున్న ఏలూరు వెంగయ్య మద్యానికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో భార్యపై పెంచుకున్న అనుమానం అతనిలో మనిషిని మృగాన్ని చేసింది. భార్యను ఎలాగైనా అంతమొందించాలనే ఉద్దేశంతో ఉన్న వెంగయ్య ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు పూటుగా మద్యం తాగి ఇంటికెళ్లాడు. అప్పటికే భార్య వెంకాయమ్మ సమీపంలోని పుట్టింటికెళ్లింది. దీంతో మరింత కోపోద్రిక్తుడైన వెంగయ్య కట్టెలు కొట్టడానికి ఉపయోగించే పదునైన మచ్చుకత్తి వెంట తీసుకొని అత్తామామల ఇంటికి వెళ్లాడు. తన భార్యను చంపేస్తానంటూ వీరంగం చేశాడు. దీంతో అడ్డుకోబోయిన అత్తామామలు చలంచర్ల జయమ్మ (60) కల్లయ్య (65)లను కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై ఆ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. అంతటితో ఆగకుండా భార్య వెంకాయమ్మపై కూడా కత్తితో దాడి చేశాడు. అయితే ఆమె తప్పించుకునే ప్రయత్నం చేయడంతో గాయాలతో బయటపడి కింద పడిపోయింది. పెద్ద కుమార్తె కేకలు వేయడంతో స్థానికులు వచ్చి గట్టిగా నియంత్రించడంతో వారిని కూడా భయభ్రాంతులకు గురి చేస్తూ కత్తితో పరారయ్యాడు. గాయపడిన వెంకాయమ్మను ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న సీఐ వెంకట్రావు, ఎస్సైలు ఆదిలక్ష్మి, రఘునాథ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. క్లూస్‌టీం ప్రాథమిక ఆధారాలు సేకరించారు. నిందితుడు వెంగయ్య కోసం స్థానికంగా, సాంకేతికంగా వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఎప్పుడుపడితే అప్పుడు పల్లెల్లో మద్యం దొరకడం వల్లే ఇలాంటి అరాచకాలు జరుగుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆధారాలు చూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమే

- తొలిరోజు పోలీసుల కస్టడీ విచారణలో కాకాణి సవాల్



కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కృష్ణపట్నం లాజిస్టిక్స్ చెక్‌పోస్టు ద్వారా బలవంతంగా నగదు వసూలు చేసినట్లు ఏ ఒక్క ఆధారం చూపించినా ఏ శిక్షకైనా తాను సిద్ధంగా ఉన్నానని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీస్ అధికారులకు సవాల్ విసిరారు. ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన షేక్ ఫరీద్‌బాబు జూన్ 7వ తేదీ ఇచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏ-1గా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఏ-2గా మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఏ-3గా తూపిలి శ్రీధర్‌రెడ్డి, ఏ-4గా స్వామి బాలాజీ ట్రాన్స్‌పోర్టు, ఏ-5గా టాటా వెంకట శేషయ్య, ఏ-6గా మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నెల్లూరు ప్రసాద్, ఏ-7గా రాగా వెంకటేశ్వర్లు, ఏ-8గా పొట్టి రాజా, ఏ-9గా సాయికిరణ్‌తోపాటు మరికొందరిని నిందితులుగా చేర్చారు. అప్పటికే జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న కాకాణిని పీటీ వారెంట్ కింద తీసుకెళ్లి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసు విచారణ నిమిత్తం ఏడు రోజుల కస్టడీకి కావాలని పోలీసులు కోరగా, రెండు రోజులకు అనుమతి ఇస్తూ న్యాయమూర్తి అనుమతి ఇచ్చారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం 1 గంటకు కృష్ణపట్నంపోర్టు సీఐ రవినాయక్, ముత్తుకూరు ఎస్సై విశ్వనాథరెడ్డి జిల్లా సెంట్రల్ జైల్లో ఉన్న కాకాణిని తమ కస్టడీకి తీసుకుని జిల్లా జైలు పక్కనే నెల్లూరు డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో విచారణ చేపట్టారు. తొలిరోజు పోలీసులు 52 ప్రశ్నలు సంధించారు. పోలీస్ అధికారులు అడిగిన ప్రశ్నలకు న్యాయవాది శ్రావణ్‌కుమార్ సమక్షంలో కాకాణి సమాధానాలు ఇచ్చారు.

పోలీసులు: కృష్ణపట్నం లాజిస్టిక్స్ చెక్‌పోస్టు ద్వారా బలవంతంగా డబ్బులు వసూలు చేసిన మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ద్వారా మీకు చేరినట్లుగా మా దర్యాప్తులో తేలింది. ఈ డబ్బులను మీరు ఎక్కడైనా ఇన్వెస్ట్ చేశారా? ఎక్కడైనా డిపాజిట్ చేశారా? మీకు ఎంత మొత్తం వచ్చిందో తెలిపాలి?

కాకాణి: నాకు ఏ ఒక్క పైసా చేరినట్లు మీ దగ్గర సాక్షాధారాలు ఉంటే చూపించండి. నేను ధైర్యంగా చెబుతున్నాను. ఏ రూపంగా అయినా ఎవరి దగ్గర నుంచి అయినా ఒక్క నయాపైసా అయినా ముట్టినట్లు రుజువులు చూపిస్తే.. నేనే న్యాయాధికారి దగ్గరకెళ్లి ఎటువంటి విచారణ అవసరం లేకుండా నేను శిక్షార్హుడనని ఏ శిక్ష విధిస్తారో విధించమని వారికి విజ్ఞప్తి చేస్తాను.

మొదటి రోజు విచారణ పూర్తి

నెల్లూరు (లీగల్): మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ముత్తుకూరు పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం మొదటిరోజు విచారణ పూర్తయింది. కృష్ణపట్నం పోర్టు సమీపంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని ముత్తుకూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో జిల్లా కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కాకాణిని న్యాయవాది నందగమ శ్రావణ్‌కుమార్, మధ్యవర్తులుగా ముత్తుకూరు మండలం పంటపాళెం వీఆర్వో గండవరం భక్తవత్సలరెడ్డి, ముత్తుకూరు వీఆర్వో బాలు వెంకటరమణయ్య సమక్షంలో విచారించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు కాకాణిని కేంద్ర కారాగారానికి తరలించారు.

పోలీస్ : కృష్ణపట్నం కంటైనర్స్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ గురించి మీ వద్ద ఉన్న సమాచారం చెప్పండి.


కాకాణి : నాకు ఎలాంటి సంబంధం లేదు. కూటమి ప్రభుత్వం అక్రమంగా బనాయించిన తప్పుడు కేసు తప్ప మరొకటి కాదు. కేవలం తప్పుడు ఫిర్యాదులు తీసుకుని కేసు కట్టడం తప్ప ఇంకోటి కాదు. పోలీసుల విచారణ జరిపి ఆధారాలు బయట పెడితే ఎలాంటి శిక్షకైనా నేను సిద్ధమే.

పోలీస్ : ప్రకాశం జిల్లా ఒంగోలు టౌన్ గోపాలనగరానికి చెందిన ద్వారం రామిరెడ్డితో మీకున్న పరిచయం చెప్పండి.

కాకాణి : ఎలాంటి పరిచయం లేదు. పేరు కూడా వినలేదు. మీరు చెప్పిన వారందరిని రెండు రోజుల కస్టడీ సమయంలో నా ఎదురుగా ప్రశ్నిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

జగనన్న పర్యటనను ఆపలేరు

- కుట్రలు, కుతంత్రాలను చీల్చుకుని అభిమన్యుడిగా వస్తాడు
- తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి, మాజీమంత్రి అనిల్, వైఎస్సార్‌సీపీ నేతలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను ఎవరూ అడ్డుకోలేరని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. జిల్లా జైల్లో ఉన్న మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు 3న నెల్లూరుకు వచ్చే జగనన్న పర్యటనను అడ్డుకునేందుకు అధికారులు, పోలీసులు, అధికార పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కుట్రలు, కుతంత్రాలను చీల్చుకుని అభిమన్యుడిగా వచ్చి తీరుతాడని చెప్పారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్తలు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, కాకాణి కుమార్తె కాకాణి పూజితలతో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం, అధికారులు ప్రయత్నించడం దారుణమన్నారు. హెలిప్యాడ్ కోసం 3, 4 స్థలాలను నాయకులు పరిశీలించారని, అడ్డంకులు, సాకులు చెబుతూ ఆ స్థలాలను అనుమతించకపోవడం దారుణమన్నారు. ఎప్పుడూ ఈ ప్రభుత్వమే ఉండదని, అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. జగనన్న మీద రాజకీయ కక్షతో హైడ్రామాలు చేయాల్సిన అవసరం లేదని, ఇలా పర్యటనను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. సంవత్సరంలోనే ప్రజలు వాస్తవాలను తెలుసుకుంటున్నారని, ప్రభుత్వం చేసే దుర్మార్గాలు ఎక్కువ రోజులు ఉండవన్నారు.

- మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ 10 రోజుల నుంచి జగనన్న పర్యటనకు ప్రయత్నాలు మొదలు పెట్టినప్పటికీ హెలిప్యాడ్ అనుమతి విషయంలో అధికారులు క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. జగనన్న పర్యటన అంటేనే కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఇంత భయయో అర్థం కావడం లేదన్నారు. రెండున్నర కి.మీ. సెక్యూరిటీ ఉండే విధంగా గుర్తించిన హెలిప్యాడ్‌పై అధికారులకు క్లారిటీ లేకపోవడం వారి భయాందోళలను తెలియజేస్తుందన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది లేని ప్రాంతాన్ని ఎంచుకున్నప్పటికీ అధికారులు మరో ప్రాంతాన్ని చూపించడం, మూడు రోజుల నుంచి కాలయాపన చేయడం ఎందుకో అర్థం కావడం లేదన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా 3వ తేదీ జగనన్న నెల్లూరుకు రావడం తథ్యమన్నారు.
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తూరులోని సెయింట్‌యాన్స్ స్కూల్, కాకుటూరులో మరో స్థలాన్ని హెలిప్యాడ్‌కు కేటాయించాలని అధికారులను కోరినప్పటికి సాకులు చెప్పి తప్పించుకుంటున్నారన్నారు. సెయింట్‌యాన్స్ స్కూల్ యాజమాన్యాన్ని అధికార పార్టీ నేతలు బెదిరించి జగనన్న పర్యటనకు అడ్డంకులు సృష్టించారన్నారు. జైలుకు సమీపంలో ముళ్ల పొదలు, హైటెన్షన్ ఎలక్ట్రికల్ వైర్లు ఉండి అప్రోచ్ రోడ్డు లేని స్థలాన్ని చూపిస్తూ అక్కడ హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకోవాలని అధికారులు చెప్పడం దుర్మార్గమన్నారు. షరతులతో సెంట్రల్ జైలు వద్ద స్థలం చూపడం సరైన పద్ధతి కాదన్నారు. జగనన్న వస్తుంటే ముందుగానే కాకాణిపై పీటీ వారెంట్ పెట్టి కోర్టుకు తరలిస్తారనే అనుమానం కూడా కలుగుతుందన్నారు. రాష్ట్రంలో మాజీ సీఎంకే స్వేచ్ఛగా తిరిగే అవకాశం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. జగనన్న పర్యటనను అడ్డుకునే ఆలోచనతో కూటమి నేతలు ఉన్నారన్నారు. జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి కూటమి నేతల్లో భయం కనిపిస్తుందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని, ప్రజాక్షేత్రంలోకి రావాలంటే భయం పుడుతుందన్నారు.

టిప్పర్లు సీజ్ చేయాలి

నెల్లూరు(అర్బన్): అనుమతి లేకుండా అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేయాలని దగదర్తి మండలం అనంతవరం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆగ్రామానికి చెందిన రాము, సుధాకర్ మాట్లాడుతూ గ్రావెల్‌ను తరలిస్తున్నందు వల్ల గ్రామానికి చెందిన రోడ్డు ధ్వంసమైందన్నారు. అలాగే చెరువు కలుజు వద్ద ఉండే బ్రిడ్జి కూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. అంతేకాకుండా గిరిజన కాలనీ గుండా టిప్పర్లు అతి వేగంగా వెళ్తుండటంతో అక్కడి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారన్నారు. టిప్పర్లను సీజ్ చేయడంతోపాటు రోడ్డును పునరుద్ధరించాలని, చెరువు వద్ద కూలేందుకు సిద్ధంగా ఉన్న బ్రిడ్జి స్థానంలో కొత్తది మంజూరు చేయాలని కోరారు. శ్రీనివాసులు, రాజా పాల్గొన్నారు.



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.8



వెల్లువలా తరలివచ్చి..

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- 480 అర్జీల అందజేత

నెల్లూరు రూరల్: నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, జెడ్పీ సీఈఓ మోహన్ రావు అర్జీలను స్వీకరించారు. మొత్తం 480 వినతులందాయి. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 186, మున్సిపల్ శాఖవి 36, సర్వేవి 48, పంచాయతీరాజ్ శాఖవి 35, పోలీస్ శాఖవి 52, సివిల్ సప్లయ్స్‌వి 14 తదితరాలున్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా సమస్యల్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వెట్టిచాకిరి నుంచి కాపాడండి


మాట్లాడుతున్న శీనయ్య

నెల్లూరు రూరల్: యానాది వర్గానికి చెందిన నిరుపేద పసిపిల్లల్ని కిడ్నాప్ చేసి హోటళ్లు, వివిధ గృహాల్లో వెట్టిచాకిరి చేయిస్తున్నారని, వారిని కాపాడాలని యానాది మహానాడు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు చౌటూరు శీనయ్య కోరారు. నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులు సమావేశంలో మాట్లాడారు. బిడ్డలు ఎక్కడ ఉన్నారో తెలియక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారన్నారు. సదరు కిడ్నాపర్లు పోలీసులకు, ప్రభుత్వానికి సవాలు విసురుతున్నారన్నారు. బాధితులు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండా తరిమేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు. సమావేశంలో శీనమ్మ, ఎం.మస్తానమ్మ, శేషమ్మ, మౌనిక, సుబ్బరత్న, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలంటూ..


అధికారులకు వినతిపత్రం ఇచ్చిన మాజీ ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు

బోగోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా అబ్దుల్ జహీర్ అక్రమాలకు పాల్పడ్డాడని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బోగోలు గ్రామ మాజీ ఉప సర్పంచ్ మద్దిబోయిన వీర రఘు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కోరారు. వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా జమ ఖర్చులు అడిగామన్నారు. దీనికి కార్యదర్శి ఇచ్చిన సమాధానంతో అక్రమాలకు పాల్పడినట్లుగా తెలిసిందన్నారు. తాగునీటి వసతి కోసం సుమారు రూ.7 లక్షలు, పారిశుధ్య సామగ్రి కొనుగోలుకు రూ.4 లక్షలు, ప్రత్యేక పారిశుధ్య పనుల కోసం రూ.4,47,300, ట్రాక్టర్ డీజిల్ కోసం రూ.2,27,752, గ్రామసభలు స్వర్ణ పంచాయతీ, షామియానాల పేరుతో రూ.1.60 లక్షలు ఖర్చు చేసినట్లుగా చెప్పారన్నారు. ప్రైవేట్‌గా పని చేస్తున్న దేవరపల్లి మనోహర్ ద్వారా లంచాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. అతడి బ్యాంక్ లావాదేవీలు పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. అదేవిధంగా సర్పంచ్ వద్ద ప్రతి పనికీ లంచం తీసుకుంటున్నారని తెలిపారు. సర్పంచ్ భర్త పందిపాటి ఉదయ్‌కుమార్, కార్యదర్శి బ్యాంక్ లావాదేవీలను పరిశీలించాలని కోరారు.

ఏకలవ్య భవన నిర్మాణం కోసం..


కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రమిస్తున్న శివ

నగరంలో ఏకలవ్య భవనం నిర్మించాలని ఏపీ గురుకుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శివ కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న కార్యక్రమాలు, శుభకార్యాలు, సమావేశాలు చేపట్టాలంటే ఇబ్బందిగా ఉందని, అందుకోసం ప్రత్యేకమైన ఏకలవ్య భవనాన్ని నిర్మించాలని కోరారు. స్థలాన్ని కేటాయించినా భవన నిర్మాణాన్ని తామే చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి బుజ్జయ్య, చైర్మన్ కట్టా రామారావు, సలహాదారులు కట్టా రమణయ్య, ఉపాధ్యక్షులు నల్లగొండ్ల వెంకయ్య, దేవరకొండ చిన్నోడయ్య, కట్టా కాటయ్య ఉన్నారు.

పాఠశాలలను ఎత్తేయడం అన్యాయం


ధర్నా చేస్తున్న కొండబిట్రగుంటవాసులు

యానాది కాలనీల్లో ప్రాథమిక పాఠశాలలను ఎత్తేయడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. మల్లి మాట్లాడుతూ బోగోలు మండలంలోని కొండబిట్రగుంట యానాది కాలనీలో 46 మంది విద్యార్థులున్న పాఠశాలను పక్క గ్రామంలోని స్కూల్లో విలీనం చేయడం దారుణమన్నారు. దళిత, గిరిజనులకు విద్య లేకుండా చేయడం అన్యాయమన్నారు. 80 మంది యానాది పిల్లలకు తల్లికి వందనం రాలేదన్నారు. కార్యక్రమంలో ఎస్.లక్ష్మయ్య, అశోక్, రాచగిరి మురళి, పి.హరిబాబు, 150 మంది మహిళలు పాల్గొన్నారు.

సిలిండర్ల చోరీ కేసులో దొంగల అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ

నెల్లూరు సిటీ: డెలివరీ బాయ్స్‌ను ఏమార్చి 23 సిలిండర్లను అపహరించిన కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సంతపేట సీఐ దశరథరామారావు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఓ గ్యాస్ ఏజెన్సీకి చెందిన సిబ్బంది గత నెల 28, 29 తేదీల్లో సిలిండర్లను డెలివరీకి తీసుకెళ్లగా దొంగలు చోరీ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు 4వ మైలుకు చెందిన పి.కార్తీక్, విడవలూరు మండలంలోని చవటపాళేనికి చెందిన పి.అనూష్‌కుమార్‌లను అరెస్ట్ చేసి రూ.1.15 లక్షల విలువైన 23 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

బంగారం, వెండి చోరీ

నెల్లూరు సిటీ: ఓ కుటుంబం సొంతూరికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బంగారం, వెండి వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు కొండాయపాళెంగేటు సమీపంలో సింహాచలం, కమల దంపతులు నివాసం ఉంటున్నారు. గత నెల 24వ తేదీన వారు ఇంటికి తాళం వేసి తమ సొంత గ్రామానికి వెళ్లారు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. కమల లోపలకి వెళ్లి చూసింది. ఇంట్లోని స్టీల్ డబ్బాలో ఉంచిన 6 గ్రాముల బంగారు నగలు, 150 గ్రాముల వెండి వస్తువులు, సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


లారీలో నుంచి పడి క్లీనర్ మృతి


నారాయణ మృతదేహం

కోవూరు: జాతీయ రహదారిపై వినాయక స్వామి గుడి సమీపంలో సోమవారం విజయవాడ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీలో నుంచి నారాయణ (37) అనే క్లీనర్ నిద్రమత్తులో అదుపుతప్పి కింద పడిపోయాడు. అతను తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే లోపు నారాయణ మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని ఎస్సై రంగనాథ్ గౌడ్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

డాక్టర్ల సేవలకు సలాం

- కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు
- నేడు డాక్టర్స్ డే



నెల్లూరు(అర్బన్): అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ఆపదలో ఉండే రోగులకు డాక్టర్లు ప్రాణాలు పోస్తున్నారు. ప్రమాదం జరిగి ప్రాణాపాయస్థితిలో ఉన్నా, ఒళ్లంతా కాలినా, పాము కరిచినా.. కొట్లాటలో కత్తులు దిగబడినా డాక్టర్లు వృత్తినే దైవంగా భావించి విసుగు, విరామం లేకుండా వైద్యం చేసి కాపాడుతున్నారు. తెల్లని చొక్కా ధరించి, చిరునవ్వుతో, నిబద్ధతతో, అంకితభావంతో వైద్యం చేస్తూ ప్రాణాలు కాపాడుతున్న డాక్టర్‌ను దేవుడితో సమానంగా చూస్తారు. కరోనా మహమ్మారి విజృంభించిన నేపథ్యంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి రోగులను కాపాడారు. ప్రతి సంవత్సరం జూలై 1వ తేదీని డాక్టర్స్ డేగా జరుపుకొంటున్నారు. జిల్లాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహిస్తారు.

రోగులకు సేవలందిస్తూ..

జిల్లాలో సుమారు 1,300 వరకు ఆస్పత్రులు, క్లినిక్‌లున్నాయి. వీటిలో 52 పీహెచ్‌సీలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 10 సామాజిక ఆస్పత్రులు (సీహెచ్‌సీలు), ఆత్మకూరులో జిల్లా ఆస్పత్రి, కందుకూరు, కావలిలో ఏరియా ఆస్పత్రి, జిల్లా కేంద్రంలో సర్వజన ఆస్పత్రులున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో 2 వేల మంది డాక్టర్లు వైద్యం చేస్తున్నారు.


ఆరోగ్యం అందరి హక్కు

ప్రజలందరికీ ఆరోగ్యం హక్కుగా అందాలని డాక్టర్లు భావిస్తున్నారు. కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటళ్లను మినహాయిస్తే ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రభుత్వ డాక్టర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. దేశంలో 70 శాతం మంది పేద, మధ్యతరగతి ప్రజలే ఉన్నారు. వీరికి వైద్యం అందించడంలో విశేష కృషి చేస్తున్నారు. డెంగీ, డయేరియా, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలినప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనే గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తున్నారు.

వైద్యం చేసి..

కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు తమ గేట్లు మూసేసుకున్నాయి. పెలు హాస్పిటళ్లు వైద్యం చేసినా రోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేసి వారి నాడి పట్టిన పాపాన కూడా పోలేదు. అలాంటి తరుణంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా వైద్యసేవలందించిన ఘనత ప్రభుత్వ వైద్యులకే దక్కుతుంది. జిల్లాలో 2 లక్షల మందికిపైగా కోవిడ్ బారిన పడగా వారికి వైద్యం చేస్తూ ఐదుగురు వైద్యులు తమ ప్రాణాలు కోల్పోయారు.


అందుబాటులో వైద్యం



ఆరోగ్యం అనేది ప్రజల హక్కు. ప్రజారోగ్యాన్ని పేద, ధనిక తేడా లేకుండా అందరూ సమానంగా పొందగలగాలి. ఇందుకోసం ప్రభుత్వాలు కృషి చేయాలి. వైద్యాన్ని ప్రైవేట్‌పరం చేయకూడదు. వైద్యకళాశాలలను ప్రభుత్వం నిర్వహించాలి. బడ్జెట్‌లో వైద్యరంగానికి అధిక నిధులు కేటాయించాలి. మందులు, వైద్యపరికరాలపై జీఎస్టీ తొలగించాలి. అప్పుడే ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తుంది.

– డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

అవగాహన కల్పించాలి



ఆరోగ్యమంటే మందులు, చికిత్సతోనే రాదు. పౌష్టికాహారం, రక్షిత మంచినీరు, పరిసరాల పరిశుభ్రత, మంచి ఆరోగ్య అలవాట్లతో నూటికి 80 శాతం జబ్బులు రాకుండా అరికట్టవచ్చు. రోగం వచ్చిన తర్వాత కన్నా రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా జబ్బులకు చెక్ పెట్టొచ్చు. ఇందుకోసం వైద్యశాఖతోపాటు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలు కలిసి ప్రజల్లో అవగాహన పెంచాలి. ఆపరేషన్లు, ఇతర వైద్యసేవలను ప్రైవేట్ వైద్యశాలలు కూడా తక్కువ ఖర్చుతోనే రోగులకు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్, పీపీ యూనిట్

'ఉపాధి' బకాయిల విడుదలకు డిమాండ్

- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా


ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

నెల్లూరు రూరల్: 'కూటమి ప్రభుత్వం బీజేపీకి వంత పాడుతూ ఉపాధి హామీ పథకానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలి' అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కూలీలకు పనులు కల్పిస్తామని చెప్పి 60 శాతం పనులను యంత్రాలతో చేయించడానికి తీర్మానాలు చేశారన్నారు. ప్రస్తుతం కూలీలతో కేవలం 40 శాతం పనులు కూడా గ్రామాల్లో చేయించడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన విధంగా పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. పని ప్రదేశాల్లో నిబంధనలను పాటించడం లేదని, ఏదైనా ప్రమాదం జరిగినా కనీసం మెడికల్ కిట్ కూడా ఉంచడం లేదన్నారు. జిల్లాలో 12 వారాలకు సంబంధించి బకాయిలున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, ప్రధాన కార్యదర్శి మంగళ పుల్లయ్య, నాపాల వెంకటేశ్వర్లు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటరమణయ్య (ఫైల్)

సైదాపురం: బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లి ఇటీవల స్వగ్రామానికి చేరుకున్న ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్న ఘటన సైదాపురం దళితవాడలో సోమవారం జరిగింది. ఎస్సై క్రాంతి కుమార్ కథనం మేరకు.. దళితవాడకు చెందిన కాకాణి వెంకటరమణయ్య (35)కు అదేకాలనీకి చెందిన భాగ్యమ్మతో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. ఓ కుమారుడు గతంలో మృతిచెందాడు. దంపతులు మూడేళ్ల క్రితం అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్నారు. అప్పులు తీర్చేందుకు వెంకటరమణయ్య కువైట్ వెళ్లాడు. మూడేళ్లపాటు అక్కడే ఉండి గత వారం స్వగ్రామానికి చేరుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో అతను ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.